సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శనివారం ◆ 28 ◆ డిసెంబర్ ◆ 2024



చీనీ టన్ను రూ.12,500

చీనీ ధరలు బాగా తగ్గాయి. శుక్రవారం అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డుకు 3.7 టన్నుల చీనీకాయలు రాగా, గరిష్టంగా టన్ను రూ.12,500 ప్రకారం ధర పలికింది.



కిలో టమాట రూ.17

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.17, కనిష్టంగా రూ.10, సరాసరిన రూ.13 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
27.9°/16.6°

జిల్లాలో శుక్రవారం తుపాను వాతావరణం నెలకొంది. ఆకాశం మేఘావృతమై పలు మండలాల్లో వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

తగ్గిన ఎండు మిర్చి ధరలు



మార్కెట్‌కు వచ్చిన ఎండు మిర్చి

హిందూపురం అర్బన్: తుపాను ప్రభావం ఎండుమిర్చి ధరలపై తీవ్రంగా చూపుతోంది. వరుస తుపాన్లతో మిర్చిలో తేమశాతం పెరిగింది. దీంతో ఎండుమిర్చి ధరలు పడిపోయాయి. శుక్రవారం హిందూపురం వ్యవసాయ మార్కెట్‌కు 103 క్వింటాళ్ల ఎండు మిర్చి రాగా, అధికారులు ఈ–నామ్ పద్ధతిలో వేలం పాట నిర్వహించారు. వేలంలో మొదటి రకం ఎండుమిర్చి క్వింటా రూ.15,500, రెండో రకం క్వింటా రూ.8 వేలు, మూడో రకం ఎండుమిర్చి క్వింటా రూ.7 వేల ప్రకారం ధర పలికినట్లు మార్కెట్ కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు.

21 మండలాల్లో వర్షం

పుట్టపర్తి అర్బన్: తుపాను ప్రభావంతో గురువారం రాత్రి నుంచి శుక్రవారం వరకూ జిల్లాలోని 21 మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా నల్లచెరువు మండలంలో 24.6 మి.మీ, కదిరి మండలంలో 21 మి.మీ వర్షపాతం నమోదైంది. తనకల్లులో 14.4 మి.మీ, ఓడీ చెరువు 14.2, గాండ్లపెంట 9.8, అమడగూరు 9.2, ఎన్పీ కుంట 7.2, కొత్తచెరువు 7.2, నల్లమాడ 6.8, పుట్టపర్తి 6.4, బుక్కపట్నం 5.6, తలుపుల 5.4, ముదిగుబ్బ 4.2, పెనుకొండ 3.8, ధర్మవరం 3.6, బత్తలపల్లి 2.8, సీకే పల్లి, సోమందేపల్లి మండలాల్లో 2.6 మి.మీ, గోరంట్ల, చిలమత్తూరు మండలాల్లో 2.2 మి.మీ, తాడిమర్రి మండలంలో 1.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు

- కలెక్టర్ టీఎస్ చేతన్



రోడ్డు ప్రమాదాల నివారణపై సమీక్షిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయి రోడ్ సేఫ్టీ కమిటీ సమీక్షా సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రమాద తీవ్రత, మరణాల సంఖ్యను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలను నడిపే వారిపై కేసులు నమోదు చేసి శిక్షపడేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. తరచూ ప్రమాదాలు తరచుగా జరిగే ప్రదేశాలను గుర్తించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. వాహనాలు నడిపే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు, వాహనదారులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల బస్సుల వెనుకభాగంలో సీసీ కెమెరాలు అమర్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని మున్సిపాలిటీల్లోని ప్రధాన కూడళ్లలో ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించేలా ఫ్లెక్సీలు ప్రదర్శించాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, రవాణా శాఖ అధికారి కరుణ సాగర్ పాల్గొన్నారు.



పోరుబాటలో భాగంగా హిందూపురంలో వైఎస్సార్ సీపీ శ్రేణుల మానవహారం



హిందూపురంలో టీఎస్ దీపిక ఆధ్వర్యంలో ర్యాలీలో పాల్గొన్న జన సందోహం



పుట్టపర్తిలో దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీలో పాల్గొన్న కార్యకర్తలు, ప్రజలు

దగాపై ధర్మాగ్రహం

కరెంటు చార్జీలు పెంచబోమని నమ్మించి దగా చేసిన కూటమి సర్కార్‌పై జనం కన్నెర్ర చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి కదం తొక్కారు. నినాదాలు..నిరసనలతో ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జోరువానలోనూ 'పోరుబాట' కొనసాగించారు. పెంచిన చార్జీలు తగ్గించకపోతే తడాఖా చూపుతామని హెచ్చరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లాలో చేపట్టిన విద్యుత్ 'పోరుబాట' కార్యక్రమం విజయవంతమైంది. అన్ని నియోజకవర్గాల్లోనూ ప్రజలతో పాటు అన్ని వర్గాల వారూ స్వచ్ఛందంగా తరలిరావడం చూసి కూటమి నేతలకు గుబులు పట్టుకుంది.

- విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా రోడ్డెక్కిన వైఎస్సార్‌సీపీ నేతలు
- జోరు వర్షంలోనూ కొనసాగిన పోరుబాట
- నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు, నిరసనలు, ధర్నాలు
- కదం తొక్కిన వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు
- స్వచ్ఛందంగా తరలివచ్చి మద్దతు తెలిపిన ప్రజలు
- చార్జీలు తగ్గించాలని విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రాల అందజేత

సాక్షి, పుట్టపర్తి

విద్యుత్ చార్జీలపై వైఎస్సార్‌సీపీ నిరసన హోరు జోరువానలోనూ కొనసాగింది. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎందాకైనా వెళ్తామంటూ.. వైఎస్సార్ సీపీ శ్రేణులు తరలివచ్చాయి. ఊరూ వాడా ఏకమై నియోజకవర్గ కేంద్రాల్లో చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేశాయి. ఓ వైపు వరుణుడు విజృంభిస్తున్నా.. ప్రజలు లెక్క చేయకుండా వచ్చారు. ఆయా నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్తల నేతృత్వంలో సాగిన ర్యాలీలు, నిరసన కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ నిరసన గళం వినిపించారు. భారీ జన సందోహం మధ్య విద్యుత్ కార్యాలయాలకు వెళ్లి 'బిల్లులు తగ్గించాలని కోరుతూ' వినతిపత్రం అందజేశారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



ధర్మవరంలో కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీగా విద్యుత్ కార్యాలయానికి వెళ్తున్న పార్టీ శ్రేణులు



విద్యుత్ చార్జీలు తగ్గించాలని పెనుకొండలో అధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న ఉషశ్రీచరణ్

ధర్మవరంలో దద్దరిల్లిన నినాదాలు..

మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఆయన నివాసం వద్ద నుంచి ర్యాలీగా బయలుదేరి కాలేజీ సర్కిల్, కళాజ్యోతి సర్కిల్ మీదుగా మార్కెట్‌లో నుంచి విద్యుత్ కార్యాలయం వరకు వెళ్లారు. అక్కడ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గ నలుమూలల నుంచి భారీగా జనాలు తరలివచ్చారు. ఈసందర్భంగా కేతిరెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యుత్ బిల్లుల భారం భరించలేనిదిగా మారిందన్నారు. బిల్లుల మోత తగ్గించకుంటే రానున్న రోజుల్లో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ర్యాలీ సందర్భంగా ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో ధర్మవరం దద్దరిల్లింది. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ కామిరెడ్డిపల్లి సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు గుర్రం శ్రీనివాసరెడ్డి, మండలాల కన్వీనర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కదిరిలో కలిసికట్టుగా...

నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మక్బూల్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా కదిలారు. పెంచిన కరెంటు చార్జీలు తగ్గించాలంటూ వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద నుంచి ర్యాలీగా ట్రాన్స్ కో కార్యాలయం వరకు వెళ్లారు. భారీ జనాల మధ్య కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ.. నాయకులు ముందుకు సాగారు. అనంతరం బిల్లుల భారం తగ్గించాలని కోరుతూ ట్రాన్స్ కో కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మక్బూల్ మాట్లాడుతూ.. కలిసికట్టుగా ఉద్యమాలు చేసి ప్రభుత్వం మెడలు వంచుతామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు పూల శ్రీనివాసరెడ్డి, వజ్రభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పెనుకొండలో పెనుతుపానులా..

మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ నేతృత్వంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెనుకొండలోని విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు. విద్యుత్ బిల్లుల భారం తగ్గించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజలపై పెనుభారం మోపుతోందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు పూర్తిగా ఉచిత విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని.. లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర వాల్మీకి విభాగం అధ్యక్షుడు పొగాకు రామచంద్ర, కౌన్సిలర్లు సుధాకర్‌రెడ్డి, వైశాలి జయశంకర్‌రెడ్డి, మండల కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తిలో భారీ ర్యాలీ..

పుట్టపర్తిలో మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి నేతృత్వంలో నియోజకవర్గ నలుమూలల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు పార్టీ కార్యాలయం నుంచి భారీ జన సందోహంతో విద్యుత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ అధికారులను కలిసి విద్యుత్ బిల్లుల భారం తగ్గించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో చేతకాని ప్రభుత్వం అధికారంలో ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి సాయిలీల, జిల్లా నాయకులు అవుటాల రమణారెడ్డి, నసనకోట ముత్యాలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మడకశిరలో కొనసాగిన నిరసన..

వైఎస్సార్ సీపీ అధిష్టానం పిలుపు మేరకు మడకశిరలో నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు 'పోరుబాట'లో భారీగా పాల్గొన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారు. విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ప్రజలపై విద్యుత్ చార్జీల భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయలేని ప్రభుత్వం దిగిపోవాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి నర్సేగౌడ, రాష్ట్ర నాయకులు రంగేగౌడ, జీబీ శివకుమార్, జెడ్పీటీసీ అనంతరాజు, ఎంపీపీలు, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురంలో నిరసనాగ్రహం..

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎస్ దీపిక ఆధ్వర్యంలో.. స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో విద్యుత్ బిల్లుల భారంపై నిరసన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. అనంతరం అక్కడి నుంచి ట్రాన్స్ కో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి.. అక్కడ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీఎస్ దీపిక మాట్లాడుతూ.. విద్యుత్ బిల్లుల భారం తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేత వేణురెడ్డి, రాష్ట్ర మహిళా నాయకురాలు నాగమణి, చిలమత్తూరు ఎంపీపీ పురుషోత్తంరెడ్డి, మండలాల కన్వీనర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొన్నారు.

రాప్తాడులో జనగర్జన..

రాప్తాడులో నిర్వహించిన పోరుబాటులో జనం గర్జించారు. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వైఎస్సార్ విగ్రహం నుంచి ర్యాలీగా వెళ్లి విద్యుత్ శాఖ కార్యాలయంలో ఏఈకి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలపై భారం పడకుండ, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తే, కూటమి ప్రభుత్వం ప్రజలపై పెనుభారం మోపుతోందన్నారు. కార్యక్రమంలో సీకే పల్లి ఎంపీపీ అంజలి, ఆత్మకూరు ఎంపీపీ హేమలత, అనంతపురం రూరల్ ఎంపీపీ వరలక్ష్మి పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మక్బూల్ ఆధ్వర్యంలో కదిరిలో పోరుబాట ర్యాలీ



మడకశిరలో ఈరలక్కప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న జన సందోహం



తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో రాప్తాడులో కదం తొక్కిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

నీరా'జనం'.. జగన్నినాదం



బత్తలపల్లి టోల్‌ప్లాజా వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న జగన్



బత్తలపల్లిలో జగన్‌తో కేతిరెడ్డి



బాగేపల్లి వద్ద జగన్‌తో వేణురెడ్డి



సోమందేపల్లి వై జంక్షన్‌లో కార్యకర్తలకు అభివాదం చేస్తున్న జగన్



రాప్తాడులో ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

'జై జగన్' నినాదం మిన్నంటింది. జాతీయ రహదారిపై అభిమాన సంద్రం పోటెత్తింది. చిన్నా, పెద్దా తేడా లేకుండా జనమంతా అభిమాన నేత రాక ఎదురుచూశారు. కళ్లారా చూసుకుని ఉప్పొంగి పోయారు. పులివెందుల పర్యటన ముగించుకుని రోడ్డు మార్గాన జిల్లా మీదుగా బెంగళూరు బయలుదేరిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అడుగడుగునా అభిమానులు బ్రహ్మరథం పట్టారు.

- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జిల్లాలో ఘన స్వాగతం
- అభిమాన నేతను చూసేందుకు భారీగా వచ్చిన అభిమానులు
- జననేతతో కరచాలనం, సెల్ఫీకోసం ఎగబడిన జనం



బాగేపల్లి టోల్‌ప్లాజా వద్ద అభిమానులతో కరచాలనం చేస్తున్న వైఎస్ జగన్

సాక్షి బృందం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శుక్రవారం జిల్లాలో అపూర్వ స్వాగతం దక్కింది. ముదిగుబ్బ, బత్తలపల్లి, రాప్తాడు, చెన్నేకొత్తపల్లి, పెనుకొండ, సోమందేపల్లి, పాలసముద్రం క్రాస్, చిలమత్తూరులో అభిమానులు బాణసంచా పేలుస్తూ ఘన స్వాగతం పలికారు.

జాతీయ రహదారిపై అభిమాన సంద్రం

ముదిగుబ్బలోని కాకతీయ ధాబా వద్ద, బత్తలపల్లిలోని టోల్‌ప్లాజా వద్ద జగన్‌ను చూసేందుకు అభిమానులు పోటెత్తారు. జై జగన్ అంటూ నినాదాలు చేశారు. వైఎస్ జగన్ వారికి అభివాదం చేశారు.

అభిమాన హోరు

రాప్తాడులోని నాలుగు రోడ్ల కూడలికి జగన్ కాన్వాయ్ చేరుకోగానే మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, అహుడా మాజీ చైర్మన్ మహాలక్ష్మీ శ్రీనివాస్‌తో పాటు వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. 'జై జగన్ జైజై జగన్' అంటూ అభిమానులు నినాదాలతో హోరెత్తించారు. జననేతతో మాట్లాడటానికి, కరచాలనం చేయడానికి పోటీ పడ్డారు. చెన్నేకొత్తపల్లిలోని వై జంక్షన్ వద్ద, గోరంట్ల మండలం పాలసముద్రం క్రాస్‌లోనూ భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు జగన్‌కు ఘన స్వాగతం పలికారు.

స్వాగతం పలికిన ఉషశ్రీచరణ్

సోమందేపల్లి వై జంక్షన్ వద్ద వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, పార్టీ నేత పొగాకు రామచంద్ర తమ అభిమాన నేతకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఇక బాగేపల్లి టోల్‌ప్లాజా వద్ద కూడా జగన్ మోహన్‌రెడ్డికి అపూర్వ స్వాగతం లభించింది. సమన్వయకర్త టీఎస్ దీపిక, వేణురెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. ఆయనతో కరచాలనం, సెల్ఫీ కోసం పోటీపడ్డారు. వారందరికీ అభివాదం చేస్తూ జగన్ ముందుకు సాగారు.



ముదిగుబ్బలో అభిమానులతో సెల్ఫీ దిగుతున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



రాప్తాడులో కారు ఎక్కి జగన్ మామయ్యను చూస్తున్న చిన్నారులు

ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు

- టీడీపీ నేతల కనుసన్నల్లోనే అక్రమ దందా
- పట్టించుకోని అధికారులు

అగళి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇసుక అక్రమ దందా ఊపందుకుంది. టీడీపీ నేతల కనుసన్నల్లోనే రోజూ టన్నుల కొద్ది ఇసుక అక్రమంగా తరలిపోతోంది. ఫలితంగా అగళి మండలం బొమ్మరసనపల్లి నుంచి కోమరేపల్లి వరకూ విస్తరించిన సువర్ణముఖి వంకలో నానాటికీ ఇసుక తరిగిపోతోంది. టీడీపీ నాయకులు అండతో సాగుతున్న ఈ అక్రమాలపై అధికార యంత్రాంగం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తోనే విమర్శలు సర్వత్రా వినవస్తున్నాయి.

నేనే 'రాజు'.. నేనే మంత్రి..

అగళి మండల పరిధిలో దాదాపు 9 కిలోమీటర్ల మేర సువర్ణముఖి వంక నుంచి పెద్దఎత్తున ఇసుక తవ్వకాలు కొనసాగుతున్నాయి. నేనే 'రాజు'.. నేనే మంత్రి అంటూ వ్యవహరిస్తున్న నియోజకవర్గానికి చెందిన ఇద్దరు ముఖ్య నేతల కన్నుసన్నల్లోనే రేయింబవళ్లూ ఇసుక అక్రమ తరలింపులు సాగుతున్నట్లు గ్రామీణులు ఆరోపిస్తున్నారు. జేసీబీని ఏర్పాటు చేసి వంకలో ఇసుకను ట్రాక్టర్ల ద్వారా పొరుగున ఉన్న కర్ణాటకకు రోజూ 8 నుంచి 9 టిప్పులకు పైగా ఇసుక తరలిపోతోంది. ఒక్కొక్క ట్రాక్టర్ ఇసుకకు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకూ వసూలు చేస్తున్నట్లు సమాచారం. నియోజకవర్గ ముఖ్య నేతల ప్రమేయం ఉండడంతో రెవెన్యూ, పోలీసు యంత్రాంగం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



మధూడి వద్ద సువర్ణముఖి వంకలో జేసీబీతో ఇసుక లోడు చేస్తున్న దృశ్యం

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి



సువర్ణముఖి వంక నుంచి గత 5 నెలలుగా ట్రాక్టర్లతో ఇసుకను అక్రమంగా కర్ణాటక ప్రాంతానికి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి. మరో 15 రోజులు ఇసుక తరలింపులు కొనసాగితే సువర్ణముఖి వంకలో ఒక లోడ్ ఇసుక దొరకడం కూడా కష్టమవుతుంది. – స్టూడియో శ్రీనివాస్, అగళి మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్

ఇసుక దొరకడం కష్టం



ఇప్పటికే సువర్ణముఖి వంకలో ఇసుక కనిపించడం లేదు. రేయింబవళ్లూ ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా కర్ణాటక ప్రాంతానికి ఇసుక తరలిస్తున్నారు. ప్రస్తుతం మండలంలో కొత్తగా ఇల్లు కట్టుకునే వారికి ఇసుక దొరడం లేదు. పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో ఓ ట్రాక్టర్ లోడు ఇసుకకు రూ.5 వేలు ఇస్తామన్నా దొరకదు. – శ్రీనివాస్, అగళి

భూగర్భ జలాలు తగ్గుతున్నాయి



సువర్ణముఖి నది నుంచి ఇసుక అక్రమ తరలింపులపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఇసుక తరలింపులను అధికారులు అడ్డుకోవాలి. ఇప్పటికే భూగర్భ జలాలు గణనీయంగా తగ్గాయి. – మల్లేశప్ప మధూడి, అగళి మండలం

వంక మొత్తం ఖాళీ



టీడీపీ నాయకులు గత రెండు నెలలుగా ఇసుక తరలింపులు చేపట్టడంతో సువర్ణముఖి వంకలో ప్రస్తుతం ఇసుక మొత్తం ఖాళీ అయింది. దీంతో జేసీబీని ఏర్పాటు చేసి మరీ తవ్వకాలు సాగిస్తూ ఇసుక తరలిస్తున్నారు. మధూడి వద్ద వంకలో గంపెడు ఇసుక దొరకడం కూడా కష్టంగా ఉంది. – మహేంద్రప్ప, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ

క్లుప్తంగా

ఈవీఎంల భద్రతపై ప్రత్యేక నిఘా ఉంచాలి



ఈవీఎం యంత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ధర్మవరం అర్బన్: ఈవీఎంల భద్రతపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా జాగ్రత్తగా ఉండాలని సంబంధిత అధికారులను కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. ధర్మవరంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో భద్రపరిచిన ఈవీఎం యంత్రాలు, వీవీప్యాట్‌ల గోదామును శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. గోదాముకు వేసిన సీళ్లు పరిశీలించారు. ఈవీఎంల రక్షణ, భద్రతపై అక్కడి సిబ్బందితో ఆరా తీశారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ మహేష్, తహసీల్దార్ నటరాజ్, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉన్నారు.

తల్లిదండ్రుల చెంతకు కుమారుడు



శివప్రసాద్‌కు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ సోమశేఖర్

బత్తలపల్లి: ప్రేమించిన అమ్మాయి బంధువులతో గొడవపడి కనిపించకుండా పోయిన శివప్రసాద్ ఆచూకీని పోలీసులు గుర్తించి శుక్రవారం తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలు... వైఎస్సార్ జిల్లా పులివెందులలోని నగరిగుట్టకు చెందిన రామాంజనేయులు ఈ నెల 22న తన కుమారుడు కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో పోలీసులు తక్షణమే స్పందించి శివప్రసాద్ ఆచూకీని పసిగట్టి శుక్రవారం బత్తలపల్లిలోని పీఎస్‌కు తీసుకువచ్చారు. క్షణికావేశ నిర్ణయాలతో తల్లిదండ్రులను బాధ పెట్టరాదని ఎస్‌ఐ సోమశేఖర్ మందలించి, తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేయించారు. మిస్సింగ్ కేసును త్వరితగతిన ఛేదించిన కానిస్టేబుల్ సుదర్శన్‌నాయుడు, అనిల్‌కుమార్‌ను సీఐ ప్రభాకర్, ఎస్‌ఐ సోమశేఖర్ అభినందించారు.

అనంత మీదుగా ఆరు రైళ్ల రద్దు



అనంతపురం సిటీ: జిల్లా కేంద్రం మీదుగా సంచరించే ఆరు రైళ్లను శనివారం నుంచి రద్దు చేస్తూ దక్షిణ మధ్య రైల్వే శాఖ ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం మీదుగా తిరిగే నాలుగు, తాడిపత్రి, కడప మీదుగా తిరిగే రెండు రైళ్లను ఈ నెల 28 నుంచి రెండు నెలల పాటు రద్దు చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కుంభమేళా పూర్తయ్యాక వీటిని తిరిగి పునరుద్ధరించనున్నట్లు సమాచారం.

- తిరుపతి నుంచి వయా పాకాల, కదిరి, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, బళ్లారి, రాయదుర్గం మీదుగా తిరుమలదేవరపల్లి వెళ్లే రైలు (57405)ను శనివారం నుంచి ఫిబ్రవరి 28 వరకు నిలిపివేశారు. ఇదే మార్గంలో తిరుమలదేవరపల్లి నుంచి తిరుపతి వెళ్లే రైలు (57406)ను ఈ నెల 29 నుంచి మార్చి 1 వరకు నిలిపివేశారు.
- గుంతకల్లు–తిరుపతి–గుంతకల్లు వయా అనంతపురం, ధర్మవరం, కదిరి, పాకాల మీదుగా నడిచే (57404/57403) రైళ్లను ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 28 వరకు రద్దు చేశారు.
- తిరుపతి–హుబ్లీ–తిరుపతి వయా తాడిపత్రి, కడప, రాజంపేట మీదుగా తిరిగే (57401/57402) రైళ్లను ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 28 వరకు రద్దు చేశారు.

ఎస్సీ కులగణనపై సోషల్ ఆడిట్

ప్రశాంతి నిలయం: జిల్లాలో ఎస్సీ కుల గణనపై జనవరి 10వ తేదీ వరకూ సోషల్ ఆడిట్ నిర్వహించనున్నారు. ఈ మేరకు కలెక్టర్ టీఎస్ చేతన్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎస్సీ జనాభా, వారి వివరాలు, పేరు, ఆధార్ నంబర్, పుట్టిన తేదీ, వయస్సు, ఉప కులం, మరుగుదొడ్డి సౌకర్యం, తాగునీటి సౌకర్యం, విద్యార్హత, వృత్తి, వ్యవసాయం, ఇతర వివరాలపై సోషల్ ఆడిట్ నిర్వహించనున్నారు. శుక్రవారం నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో జాబితాను ప్రదర్శించనున్నారు. దీనిపై అభ్యంతరాలను ఈ నెల 31వ తేదీ వరకూ స్వీకరించనున్నారు. వీఆర్వో స్వీకరించిన అభ్యంతరాలను మూడు దశల్లో పరిశీలిస్తారు. జనవరి 10న కుల గణన తుది జాబితాను పోర్టల్‌లో అందుబాటులోకి తేనున్నారు.

డ్రైవర్‌కు ఏడాది జైలు

రాప్తాడు: రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతికి కారకులైన డ్రైవర్‌కు ఏడాది జైలు శిక్ష పడింది. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ శ్రీహర్ష మీడియాకు వెల్లడించారు. మరూరు గ్రామానికి చెందిన మూగి నరసింహులు 2017లో గ్రామం వద్ద 44వ జాతీయ రహదారి దాటుతుండగా బొలెరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో మూగి నరసింహులు మృతి చెందాడు. అప్పటి సీఐ ధరణిబాబు కేసు దర్యాప్తు చేశారు. విచారణ అనంతరం మూగి నరసింహులు మృతికి కారకులైన బొలెరో డ్రైవర్ ఈడిగ గోపాలకృష్ణకు ఏడాది జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ అనంతపురం స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జడ్జి సృజన్ కుమార్ శుక్రవారం తీర్పు వెలువరించారు. కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాసులు వాదించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

ధర్మవరం అర్బన్: చోరీ కేసులో ఓ యువకుడిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ శ్రీనివాసులు, ధర్మవరం సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్థానిక వన్‌టౌన్ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. రామగిరి మండలం నసనకోట గ్రామానికి చెందిన సాకే నారాయణ ధర్మవరంలోని ఎల్–3 కాలనీలో నివాసముంటున్నాడు. కొన్ని నెలల క్రితం కళాజ్యోతి, అంజుమన్ సర్కిళ్లలో మహిళలను మాయమాటలతో ఏమార్చి వారి వద్ద ఉన్న బంగారు నగలను అపహరించాడు. అలాగే లక్ష్మీచెన్నకేశవపురంలో రాత్రి సమయంలో ఇంటి తాళం బద్ధలుగొట్టి లోపలకు ప్రవేశించి విలువైన బంగారు నగలను ఎత్తుకెళ్లాడు. ఆయా ఘటనల్లో కేసులు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తులో భాగంగా శుక్రవారం యర్రగుంట సర్కిల్‌లో తచ్చాడుతున్న సాకే నారాయణను గుర్తించి అరెస్ట్ చేశారు. మూడు జతల బంగారు కమ్మలు, 2.50 తులాల బంగారు చైన్, 1.50 తులాల బంగారు చైన్, ఓ ఉంగరం స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. నిందితుడి అరెస్ట్‌లో చొరవ చూపిన వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్, ఎస్‌ఐ గోపీకుమార్, హెడ్ కానిస్టేబుల్ శివకుమార్, కానిస్టేబుళ్లు శివశంకర్, భాస్కర్‌ను డీఎస్పీ శ్రీనివాసులు అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

మన్మోహన్‌సింగ్‌కు ఘన నివాళి

పుట్టపర్తి టౌన్: ఆర్థిక సంస్కరణల సారథి, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అని మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి కొనియాడారు. శుక్రవారం పుట్టపర్తిలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నాయకులతో కలసి మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మన్మోహన్‌సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడే దేశ ఆర్థిక వ్యవస్థ పరుగులు పెట్టిందన్నారు. దేశం అత్యంత వేగంగా అభివృద్ధిగాంచిందన్నారు. 2004 నుంచి 2014 వరకు ప్రధానిగా పనిచేసిన ఆయన... వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఉమ్మడి ఏపీ అభివృద్ధికి తోడ్పాటునందించారన్నారు. వివాద రహితుడుగా, అత్యంత సౌమ్యుడిగా, మృదుస్వభావిగా మచ్చలేని రాజనీతిజ్ఞుడిగా పేరు తెచ్చుకున్న మన్మోహన్ సింగ్ మృతి బాధాకారమన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎంపీ మాధవ్

కేసుల పేరుతో వేధింపులు సరికాదు

పెనుకొండ రూరల్: కేసుల పేరుతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను వేధించడం సరికాదని సీఐ రాఘవన్‌కు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ హితవు పలికారు. శుక్రవారం పెనుకొండలోని సర్కిల్ కార్యాలయానికి చేరుకున్న ఆమె నేరుగా సీఐతో సంప్రదించారు. సోమందేపల్లి మండలం నాగినాయణచెరువు పంచాయతీ బుసయ్యగారిపల్లికి చెందిన శ్రీరామప్ప, శకుంతలమ్మ, నరసింహప్ప, గోవిందరెడ్డిను పోలీసుల వేధింపులు, పెనుకొండలో ఇటీవల చోటు చేసుకున్న ఓ వివాదానికి సంబంధించి బాబా, నయాజ్, షెక్షా, బేల్దారి షెక్షాపై అక్రమంగా కేసుల నమోదు చేసిన అంశాలపై చర్చించారు. వాస్తవాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. దీనిపై సీఐ సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా ఆమె వెంట వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, సోమందేపల్లి మండల కన్వీనర్ గజేంద్ర, నాగినాయనచెరువు సర్పంచ్ అంజినాయక్, పెనుకొండ నగర పంచాయతీ కౌన్సిలర్ సద్దాం తదితరులు ఉన్నారు.

రైలు పట్టాలపై మొరాయించిన లారీ

సోమందేపల్లి: మండలంలోని చాకర్లపల్లి రైల్వే స్టేషన్ వద్ద పట్టాలపై ఓ లారీ మొరాయించింది..శుక్రవారం ఉదయం హిందూపురం వైపు నుంచి అనంతపురం వెళుతున్న లారీ రైల్వే గేట్ వద్దకు చేరుకోగానే పట్టాలు దాటుతుండగా మధ్యలోనే నిలిచిపోయింది. డ్రైవర్ విశ్వ ప్రయత్నాలు చేసినా ముందుకు కదల్లేదు. దీంతో గేట్‌మెన్ వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో న్యూఢిల్లీ నుంచి బెంగళూరు వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రైలును రంగేపల్లి రైల్వేస్టేషన్ ఆపారు. అలాగే కొయంబత్తూరు నుంచి రాజ్‌కోట్‌కు వెళుతున్న రైలును మలుగూరు రైల్వేస్టేషన్‌లో ఆపేశారు. అరగంట పాటు ఆ మార్గంలో వాహనాల రాకపోకలు స్తంభించాయి. చివరకు జేసీబీని తీసుకువచ్చి లారీని అక్కడి నుంచి తొలగించారు. కాగా, ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఏఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.



దాడి చేసింది కాక జైలుకు పంపుతారా?

- రాబోవు రోజుల్లో మూల్యం చెల్లించక తప్పదు
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక, నాయకుడు వేణురెడ్డి

హిందూపురం: వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడిచేయడమే కాకుండా అక్రమంగా కేసులు బనాయించి జైలుకు పంపడం రాజకీయ ప్రేరేపిత కుట్రగానే భావించాల్సి వస్తోందని, ఈ వైఖరి ఎంతో కాలం నిలవదని, రాబోవు రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని టీడీపీ నేతలను వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక, నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి హెచ్చరించారు. హిందూపురం సబ్‌జైలులో రిమాండ్‌లో ఉన్న చిలమత్తూరు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు శివప్ప, వెంకటరమణప్ప, చంద్రను పార్టీ నాయకులతో కలసి శుక్రవారం వారు పరామర్శించారు. అనంతరం జైలు బయట మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏ ప్రోద్బలంతోనే పోలీసు స్టేషన్‌లో పోలీసుల సమక్షంలో వంద మంది టీడీపీ గూండాలు చిలమత్తూరు వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడి చేశారన్నారు. దాడి చేసిన వారిని వదలి బాధితులపై ఐపీసీ 307 సెక్షన్ కింద కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపడం పోలీసుల ఏకపక్ష ధోరణికి నిదర్శనమన్నారు. ఇది అప్రజాస్వామిక చర్యగా అభివర్ణించారు. ఇప్పటికే కూటమి సర్కార్ తీరుపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు. రాబోవు జమిలీ ఎన్నికల్లో గెలుపు వైఎస్సార్‌సీపీదే అవుతుందన్నారు. ఈ రోజు మంచిగా ఉంటే అదే ధోరణిలో భవిష్యత్తులోనూ తాము మంచిగా ఉంటామని పేర్కొన్నారు. మంచిగా ఉన్న అధికారులకైనా, నాయకులకైనా సెల్యూట్ కొడతామన్నారు. అలా కాదని కక్ష సాధింపు చర్యలకు దిగితే తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ఇలాంటి దాడులు, కేసుల బనాయింపులు పునావృతం కాకుండా అందరూ శాంతియుతంగా మెలగాలన్నదే తమ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, హిందూపురం ప్రజలు శాంతి కాముకలనే నమ్మకాన్ని వమ్ము చేయరాదని కోరుకుంటున్నామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పురుషోత్తంరెడ్డి, ఎంపీటీసీ రఘునాథరెడ్డి, సర్పంచ్ శంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామకృష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఆయూబ్, శంకర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, నాగమణి, షాజియా, రాంమూర్తి, కవిత, నాగరాజు, శబరీష్ తదితరులు పాల్గొన్నారు.



సబ్‌జైలులో రిమాండ్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకులను పరామర్శించి వస్తున్న టీఎన్ దీపిక, వేణురెడ్డి, పార్టీనాయకులు

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

ధర్మవరం అర్బన్: ఇంటర్ విద్యార్థులకు జనవరి నుంచి మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించనున్నట్లు డీఈఓ కృష్ణప్ప తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో ఆయన సమావేశమై మాట్లాడారు. అన్ని మండలాల ఎంఈఓలు ఆయా జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలను కో–ఆర్డినేషన్ చేసుకుని మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీవీఈఓ రఘునాథరెడ్డి, ఏడీలు నాగరాజు, నాజర్, సూపరింటెండెంట్ ప్రసాద్, ఎంఈఓ గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ కృష్ణప్ప

రైతులకు పామిడి మండల వాసి కుచ్చుటోపీ

బత్తలపల్లి: తనకు పొలం ఉందని, ఆవులు, గేదెలు అమ్మితే వాటిని కొనుగోలు చేస్తానంటూ నమ్మబలికి రైతులకు కుచ్చుటోపీ వేసిన ఘటన బత్తలపల్లిలో శుక్రవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం జిల్లా పామిడి మండలం దేవరపల్లికి చెందిన శ్రీనివాసులు బత్తలపల్లిలోని మారుతీనగర్‌లో నివాసముంటున్నాడు. ఆయన తానో పెద్ద రైతునంటూ పరిచయం చేసుకుని ఆవులు, గేదెలు కొనుగోలు చేస్తున్నట్లు రైతులను నమ్మించారు. ఈ నేపథ్యంలో బత్తలపల్లి మండలం గుమ్మల్లకుంట గ్రామానికి చెందిన ఈశ్వర్‌రెడ్డి వద్ద రూ.5లక్షలు విలువ చేసే ఐదు ఆవులు, దంపెట్ల గ్రామానికి చెందిన శంకరయ్య వద్ద రూ.5వేలు విలువ చేసే ఆవు, తాడిమర్రి మండలం మరువపల్లి గ్రామానికి చెందిన వన్నూరురెడ్డి వద్ద రూ.70వేలు విలువ చేసే గేదె, 35 ప్యాకెట్ల సద్దలు, బత్తలపల్లికి చెందిన మటన్ వ్యాపారి నాగరాజు వద్ద నుంచి నాలుగు గొర్రెలు తీసుకుని డబ్బు పది రోజులకు ఇస్తానంటూ నమ్మబలికాడు. పది రోజుల తర్వాత కనిపించకుండా పోయాడు. ఇంటి వద్దకు చేరుకున్న బాధితులు తాము మోసపోయినట్లు గుర్తించి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కబడ్డీ పోటీల్లో జిల్లా ఖ్యాతిని చాటండి





ఎంపికైన బాలికలతో ఆర్డీటీ సిబ్బంది, కబడ్డీ సంఘం నాయకులు, ఎంపికైన బాలుర జట్టు

బత్తలపల్లి: త్వరలో కర్నూలు జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి బాల బాలికల కబడ్డీ పోటీల్లో రాణించి ఉమ్మడి జిల్లా ఖ్యాతిని చాటాలని క్రీడాకారులకు వక్తలు పిలుపునిచ్చారు. శుక్రవారం బత్తలపల్లిలోని ఆర్డీటీ క్రీడా మైదానంలో జూనియర్స్ విభాగంలో బాలబాలికల కబడ్డీ జట్లను ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లా నుంచి 60 మంది బాలురు, 30 మంది బాలికలు హాజరు కాగా, వీరిలో ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన వారు జనవరి 3 నుంచి 5వ తేదీ వరకు కర్నూలు జిల్లాలో జరిగే మూలపురి రంగారావు మెమోరియల్ రాష్ట్ర స్థాయి బాలబాలికల కబడ్డీ పోటీలకు జిల్లా తరఫున ప్రాతినిథ్యం వహిస్తారు. ఎంపికైన క్రీడాకారులనుద్దేశించి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్డీ ప్రమీల, ఏటీఎల్ రుక్మాంగద, అనంతపురం జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు రామతేజ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు సంపత్‌కుమార్ ఆచారి, సెక్రటరీ రాగిరి రామయ్య తదితరులు మాట్లాడారు.

ఎంపికైన క్రీడాకారులు వీరే...

బాలుర విభాగం: తరుణ్‌కుమార్, ఎర్రిస్వామి, అశోక్, హరిచరణ్, వెంకటప్రసాద్, శ్రీనాథ్, వినోద్, సూర్యకుమార్, దాదాఖలందర్, మహేష్, సలీం, చరణ్. స్టాండ్‌బై గా యశ్వంత్, మణికుమార్, నరేంద్ర, హజరత్‌వలి.

బాలికల విభాగం: మేజబీ, ఆయేషా, గంగోత్రి, పూజ, సాజిదా, నవ్య, దీక్షిత, వాణిశ్రీ, సాగరిక, నందిని, జ్యోతి, ధరిణి, నిఖిలప్రియ, వాణిశ్రీ, హారిక, భారతి.

వలస కూలీ మృతి



సందే నాయక్

నల్లచెరువు: మండలంలోని బాలేపల్లి గ్రామానికి చెందిన సందే నాయక్(59) ప్రమాదవశాత్తు బాత్‌రూమ్‌లో కాలు జారిపడి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు... బాలేపల్లి తండాకు చెందిన సందే నాయక్ కూలి పనుల కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లాడు. అక్కడే అద్దె ఇంట్లో ఉంటూ కూలి పనులతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం స్నానం చేసేందుకు వెళ్లిన ఆయన బాత్‌రూమ్‌లో కాలు జారి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలియగానే బాలేపల్లి తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు, బంధువులు హైదరాబాద్‌కు తరలివెళ్లారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ధర్మవరం అర్బన్: స్థానిక పోతుకుంట రైల్వే ఓవర్ బ్రిడ్జి కింద ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని శుక్రవారం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న రెండో పట్టణ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. గురువారం రాత్రి అతిగా మద్యం సేవించి మృతి చెందినట్లు ప్రాథమిక విచారణలో నిర్ధారించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు ధర్మవరం రెండో పట్టణ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.